క్లుప్తంగా

ప్రజాసమస్యలే ఎన్నికల అజెండా కావాలి

యునైటెట్ ఫోరం ఫర్ డెమోక్రసీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజా సమస్యలే ప్రధాన ఎజెండా కావాలని వక్తలు పేర్కొన్నారు. గాంధీనగర్‌లోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్లో ఆదివారం యునైటెడ్ ఫోరం ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో ప్రస్తుత దేశ పరిస్థితులు మన కార్యచరణ అనే అంశంపై సదస్సు జరిగింది. సదస్సులో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో మతతత్వ వాదులకు మద్దతు ఇవ్వొద్దని పిలుపునిచ్చారు. ఢిల్లీకి చెందిన ముస్లిం మత పెద్ద జనాబ్ మాలిక్ మౌతసిమ్ ఖాన్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. జమాత్ అధ్యక్షులు ముహమ్మద్ రఫీఖ్ మాట్లాడుతూ నేటి రాజకీయాల్లో స్వార్థ చింతన పెరిగిపోయిందన్నారు. అనంతరం ఫోరం తరపున ప్రజా మేనిఫెస్టోను విడుదల చేశారు. సదస్సులో హైకోర్టు న్యాయవాదులు పిచ్చుక శ్రీనివాస్, మతీన్, రిజ్వాన్, రమేష్ పట్నాయక్, పాస్టర్ శ్రీనివాస్, హాఫిజ్ మస్తాన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎండలు పెరుగుతున్న దృష్ట్యా వృద్ధులు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని ఆయుర్వేద డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్, హోమియో డాక్టర్ కోనా వీరబ్రహ్మం అన్నారు. స్థానిక దుర్గాపురం విజయ్‌నర్సింగ్ కళాశాలలో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన వయోవృద్ధులకు ఉచిత వైద్య శిబిరం, అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయుర్వేదం, హోమియో చికిత్స ద్వారా ఎటువంటి దుష్పరిణామాలు లేకుండా అన్ని రకాల వ్యాధులను నయం చేయవచ్చన్నారు. సీజనల్ పండ్లు, కాయగూరలను తీసుకుంటూ తరచూ నీటిని తీసుకోవాలని సూచించారు. అనంతరం ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

మంచి నడవడిక అలవర్చుకోవాలి

డీసీపీ కృష్ణకాంత్ పాటిల్



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నేరస్తులు, రౌడీషీటర్లు నేరప్రవృత్తి వీడి మంచి నడవడిక అలవర్చుకోవాలని డీసీపీ కృష్ణకాంత్ పాటిల్ సూచించారు. రౌడీషీటర్లు, లా – ఆర్డర్ అండ్ క్రైంసస్పెక్ట్‌లకు అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరస్తులు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి ఇతర మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా చేయకుండా సత్ప్రవర్తనతో నడవాలన్నారు. ప్రతి ఒక్కరిపై పోలీస్ నిఘా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో నార్త్ జోన్ ఏసీపీ దేవరకొండ ప్రసాద్, సింగ్‌నగర్, నున్న, సత్యనారాయణపురం సీఐలు గురుప్రకాష్, దుర్గాప్రసాద్, వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

8న ప్రత్యేక పూజలు, అభిషేకాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలోని చంద్రశేఖర స్వామివారికి ఈనెల 8వ తేదీ మహాశివరాత్రి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించనున్నట్లు మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారికి విశేషంగా మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం, బిల్వార్చనలు జరుగుతాయని పేర్కొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు శివ పారాయణం చేస్తామని తెలిపారు.

బాబా మందిరంలో అన్నప్రసాద వితరణ

పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో ఆదివారం దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కేంద్ర పారా మిలటరీ బలగాల కవాతు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): త్వరలో జరగనున్న ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా, సంఘ విద్రోహ శక్తులను నిర్మూలించడానికి సిద్ధంగా ఉన్నామని వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి పేర్కొన్నారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని రూరల్ ప్రాంతాలైన జక్కంపూడి వైఎస్సార్ కాలనీ, అంబాపురం, పి.నైనవరం గ్రామాల్లో ఆదివారం కేంద్ర పారా మిలటరీ బలగాలు, విజయవాడ నగర పోలీసు బలగాలు కవాతును నిర్వహించాయి. తొలుత కాలనీకి చేరుకున్న ప్రత్యేక పోలీసు బృందాలకు వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి పలు సూచనలు చేశారు. అనంతరం కాలనీలోని ప్రధాన రహదారులతో పాటు పాముల కాల్వ, అంబాపురం, నైనవరం ప్రాంతాల్లో కవాతు నిర్వహించిన ప్రజలకు భరోసా కల్పించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు వెస్ట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట వన్‌టౌన్, భవానీపురం, ఇబ్రహీంపట్నం పీఎస్‌ల సీఐలు గణేష్, దుర్గాశేఖర్‌రెడ్డి, వి.కృష్ణ, సత్యనారాయణ, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వేగంగా దోబీఖానా అభివృద్ధి

31వ డివిజన్‌లో రూ. 12 లక్షలతో పనులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): డివిజన్‌లో అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా 31వ డివిజన్ ముత్యాలంపాడులో శిథిలావస్థకు చేరిన దోబీఖానాను రూ. 12 లక్షలతో అభివృద్ధి చేస్తున్నారు. ఇటీవల ఇక్కడ పర్యటించిన కార్పొరేటర్ పెనుమత్స శిరీష దోబీఖానా శిథిలావస్థకు చేరుకోవడం గమనించారు.

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన దోబీఖానాలో సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన వెలంపల్లి శ్రీనివాసరావు అధికారులతో మాట్లాడి సత్వరమే దోబీఖానా మరమ్మతులకు అవసరమైన నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. దీంతో దోబీఖానా మరమ్మతులు, ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు. వీలైనంత త్వరగా పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువస్తామని అధికారులు చెబుతున్నారు.



దోబీఖానాలో నీటి తొట్టెలకు మరమ్మతులు నిర్వహిస్తున్న దృశ్యం

గత ప్రభుత్వం పట్టించుకోలేదు



గత ప్రభుత్వం ఇక్కడ సమస్యలను పట్టించుకోలేదు. దీంతో దోబీఖానాలో బట్టలు ఉతుక్కోవాలంటేనే ఇబ్బందిగా ఉంది. ఇప్పటికైనా మరమ్మతులు ప్రారంభించటం ఆనందంగా ఉంది.

–బెజవాడ రాము, స్థానిక రజకుడు

సంతోషంగా ఉంది



ఇక్కడ దోబీఖానా శిథిలావస్థకు చేరుకోవడంతో బయట ప్రాంతాలకు వెళ్లి బట్టలు ఉతుక్కోవాల్సి వస్తుంది. ప్రభుత్వాలు మారుతున్నా ఇక్కడ సమస్యలు పట్టించుకోలేదు. ఇప్పుడు శిథిలమైన నీటి తొట్టెలు, ఫ్లోరింగ్‌లకు మరమ్మతులు చేయడంతోపాటు బట్టలు ఆరవేసుకునేందుకు పైపులు, ప్రహరీ గోడ నిర్మించటం సంతోషంగా ఉంది.

–నగ్గుర్తి నాగరాజు, స్థానిక రజకుడు

రజకుల సమస్యలు పరిష్కారం



గత ప్రభుత్వ నేతలు రజకులను ఓటు బ్యాంకుగానే చూశారు. ఇప్పుడు మంచి చేసే చేతల వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రజకుల సమస్యలను పరిష్కరించాలని నిర్ణయించుకున్నాం. సంబంధిత అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించటంతో పాటు రజకుల సమస్యలను పరిష్కరిస్తున్నందుకు గర్వంగా ఉంది.

–పెనుమత్స శిరీష, 31వ డివిజన్ కార్పొరేటర్

నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు 'ఏఐ'



కె.చక్రవర్తి, డీసీపీ, ట్రాఫిక్

సాక్షి ఇంటర్వ్యూ

విజయవాడస్పోర్ట్స్: విజయవాడ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)తో పరిష్కరించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు ట్రాఫిక్ డెప్యూటీ పోలీస్ కమిషనర్(డీసీపీ) కె.చక్రవర్తి స్పష్టం చేశారు. పోలీస్ కమిషనర్ టి.కె.రాణా ఆదేశాలతో విజయవాడ మున్సిపల్ కమిషనరేట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ ప్రణాళికను సిద్ధం చేసినట్లు చెప్పారు. నగరంలో రద్దీ ఎక్కువగా ఉండే ముఖ్యమైన మూడు ప్రదేశాల్లో పైలెట్ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. దీనితో పాటు రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పెరిగే ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు, రహదారి భద్రతా పరంగా తలెత్తే వివాదాలను పరిష్కరించేందుకు నూతన ప్రణాళికను సిద్ధం చేసినట్లు 'సాక్షి'తో ఆదివారం తెలిపారు.

సాక్షి: ఏఐ పని తీరు ఎలా ఉంటుంది.

డీసీపీ: నగరంలోని కొన్ని కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్‌కు ఫిక్స్‌డ్ టైం ఏర్పాటు చేశాం. అయితే కొన్ని కొన్ని సమయాల్లో ఆయా రోడ్లపై వెళ్లే వాహనాలు లేకున్నా సమయం(సెకన్లు) ఎక్కువగా ఉండటంతో సిగ్నల్ రెడ్‌లోనే ఉంటుంది. ఇది వేరే మార్గంలోని వాహన చోదకులకు ఇబ్బందికరంగా మారింది. దీన్ని పరిష్కరించడానికి అడాప్టడ్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్‌లో భాగంగా ఏఐ టెక్నాలజీని అందుబాటులోకి తేవాలనుకుంటున్నాం. దీనిలో భాగంగానే కూడళ్లలోని ట్రాఫిక్ పోల్స్‌కు ప్రత్యేకంగా సిద్ధం చేసిన కెమెరాలను అమర్చుతాం. ఆయా మార్గాల్లో ప్రయాణించే వాహనాలను ఈ ఏఐ కెమెరాలు క్యాప్చర్ చేస్తాయి. ఏ మార్గంలో వాహనాలు ఎక్కువగా ఉన్నాయో, ఏ మార్గంలో వాహనాలు తక్కువగా ఉన్నాయో కెమెరాలు వాటంతట అవే తెలుసుకుంటాయి. ట్రాఫిక్ క్లియరెన్స్ కోసం వాహనాలు ఎక్కువగా ఉన్న మార్గానికి వెంటనే ఎక్కువ సమయం కేటాయిస్తాయి. వాహనాలు తక్కువ ఉన్న మార్గానికి సమయం తగ్గించేస్తుంటాయి. ఇది ఆటోమెటిక్‌గా పని చేస్తుంది. పైలెట్ ప్రాజెక్ట్‌లో ఏఐ పనితీరు మెరుగ్గా, ప్రజలకు ఉపయోగకరంగా ఉందని తేలితే నగరంలోని అన్ని సిగ్నల్స్ వద్ద ఈ టెక్నాలజీని అమలు చేస్తాం.

సాక్షి: ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ప్రస్తుతం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

డీసీపీ: ఉదయం, సాయంత్రం వేళల్లో సిగ్నల్స్ వద్ద పెరిగే వాహనాల రద్దీ కారణంగా ఉత్పన్నమయ్యే సమస్యను పరిష్కరించేందుకు ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఐటీఎంఎస్)ను అమలు చేస్తున్నాం. పీసీఆర్ జంక్షన్ నుంచి బెంజిసర్కిల్ వరకు, బెంజిసర్కిల్ నుంచి రామవరప్పాడు వరకు, రామవరప్పాడు నుంచి తిరిగి(ఏలూరు రోడ్డు మీదుగా) పీసీఆర్ జంక్షన్ వరకు, బీఆర్టీఎస్ రోడ్డులలోని 17 సిగ్నల్స్ వద్ద ఐటీఎంఎస్ ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఈ సిగ్నల్ వ్యవస్థ పూర్తిగా కేంద్రీకృతమై.. కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానమై ఉంటుంది. ఆయా సిగ్నల్స్ వద్ద ట్రాఫిక్ గురించి, సిగ్నల్స్ పనితీరు కంట్రోల్ రూం నుంచే తెలుసుకోవచ్చు. అక్కడ విధుల్లో ఉండే సిబ్బందికి కంట్రోల్‌రూం నుంచి దిశానిర్దేశం చేయొచ్చు. పలు రాజకీయ పార్టీ ప్రజాప్రతినిధుల పర్యటన, ముందస్తు పోలీసు అనుమతి ఉన్న ర్యాలీల సందర్భంగా ప్రజలు ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా ఈ విధానం సహాయపడుతుంది.

సాక్షి: రాత్రి సమయంలో ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

డీసీపీ: రాత్రి సమయంలో ప్రమాదాల నివారణకు బారికేట్లపై బ్లింకర్స్‌ను ఏర్పాటు చేశాం. నగరంలోని ప్రధాన కూడళ్లు, ఇతర కూడళ్ల వద్ద 300లకు పైగా బ్లింకర్స్‌ను ఏర్పాటు చేశాం. ఇవి పూర్తిగా సోలార్‌తో పని చేస్తాయి. పగటి సమయంలో ఆటోమేటిక్‌గా సూర్యరశ్మితో పవర్‌ను సేకరిస్తాయి. చీకటి పడగానే ఆటోమేటిక్‌గా అదే పవర్‌తో ఎరుపు, పసుపు రంగులలో బ్లింక్ అవుతూ వాహన చోదకులకు హెచ్చరికలు జారీ చేస్తుంటాయి. వీటిని ఏర్పాటు చేసిన నాటి నుంచి రాత్రి సమయంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గింది.

సాక్షి: ఎన్నికల సమయంలో వివాదాలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

డీసీపీ: మద్యం సేవించి వాహనాలను నడిపే వ్యక్తులను అదుపు చేస్తే చాలా వరకు వివాదాలకు చెక్ పడుతుంది. ఈ బాధ్యత మా ట్రాఫిక్ విభాగంపైనే ఉంది. అందుకే ఇప్పటి నుంచే దూకుడు పెంచాం. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి సారించాం. గడిచిన 65 రోజుల్లో సిటీలో 1,273 మందిపై కేసులు నమోదు చేశాం. వీరిలో 1,002 మందిని కోర్టులో హాజరుపర్చగా నిందితులకు రూ.1.05 కోట్లు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. 90 మందికి ఒకటి నుంచి ఎనిమిది రోజుల వరకు జైలు శిక్ష పడింది. మద్యం సేవించి వాహనాలు నడిపిన ఎవరినీ ఉపేక్షించేది లేదు. దీనితో పాటు ఈ–చలానా యాప్ మళ్లీ అందుబాటులోకి వచ్చింది. ట్రిపుల్ రైడ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే ఈ–చలానా వచ్చేస్తుందని వాహన చోదకులు గుర్తించాలి. చలానాలను యూపీఐ(ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం) యాప్‌ల ద్వారా చెల్లించుకునే వెసులుబాటు ఉంది.

సాక్షి: అంబేడ్కర్ స్మృతివనం వద్ద ట్రాఫిక్ సమస్యను ఎలా పరిష్కరిస్తారు

డీసీపీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన సామాజిక న్యాయ మహాశిల్పం అంబేడ్కర్ స్మృతివనం వద్ద ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. రాష్ట్ర, దేశ నలుమూలల నుంచి బస్సుల్లో, ప్రత్యేక వాహనాల్లో ఈ మహా శిల్పం చూసేందుకు భారీగా ప్రజలు వస్తున్నారు. విగ్రహం ఆవరణలో ద్విచక్ర వాహనాలకు కేటాయించిన పార్కింగ్ ప్రదేశం సరిపోవడం లేదు. దీంతో పాత రైతుబజార్ రోడ్డులో ప్రత్యేకంగా పార్కింగ్ ప్రదేశాన్ని కేటాయించాం. పర్యాటకుల తాకిడితో అక్కడ పెరుగుతున్న ట్రాఫిక్‌ను పరిష్కరించేందుకు నిత్యం అక్కడ పది మంది పోలీసు అధికారుల, సిబ్బందికి విధులు కేటాయిస్తున్నాం.

పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలి



పోలియో డ్రాప్స్ వేస్తున్న కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి



పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి



29వ డివిజన్‌లో పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి

పాయకాపురం(విజయవాడరూరల్): ఐదేళ్లలోపు వయసున్న ప్రతి చిన్నారికి తప్పకుండా పోలియో నివారణ మందు వేయించాలని 61వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి అన్నారు. ఆదివారం 61వ డివిజన్‌లోని మూడు కేంద్రాల్లో 625 మంది పిల్లలకు పోలియో డ్రాప్స్ వేసినట్టు డాక్టర్ ఖాజా తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉమ్మడి వెంకట్రావ్, తదితరులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

–ప్రకాష్‌నగర్లోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి పోలియో చుక్కల మందు వేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అలంపూరు విజయ్‌కుమార్, డాక్టర్ కె.రాజా, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. డివిజన్లో 1655 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్టు డాక్టర్ తెలియచేశారు. 63వ డివిజన్లో కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మ పోలియో డ్రాప్స్ వేశారు. డివిజన్లోని 6 కేంద్రాల్లో 1980 మంది పిల్లలకు పోలియోచుక్కలు వేసినట్టు డాక్టర్ రాథోడ్ తెలియచేశారు. 64వ డివిజన్ కండ్రికలో నేతలు యరగొర్ల శ్రీరాములు వైద్య సిబ్బందితో కలిసి చిన్నారులకు పోలియో డ్రాప్స్ వేశారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 29వ డివిజన్‌లోని ఆరోగ్యకేంద్రంలో కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మురికి వాడల్లో చిన్నారులకు మధురానగర్‌కు చెందిన హెల్త్ అండ్ వెల్త్ సంస్థ ఆధ్వర్యాన పోలియో చుక్కలు వేశారు. మధురానగర్ వీవీ నరసరాజు రోడ్డు, అంబేడ్కర్ కాలనీ తదితర ప్రాంతాల్లో చిన్నారులకు సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ చిలకపాటి రామ్‌చంద్ పోలియో చుక్కలు వేశారు. 32వ డివిజన్‌లో జరిగిన పల్స్ పోలియో కార్యక్రమంలో వీఎంసీ కో ఆప్షన్ సభ్యురాలు సుభాషిణి, డివిజన్ ఇన్‌చార్జి సుందర్‌పాల్ పాల్గొన్నారు. స్థానిక 27వ డివిజన్ 200వ వార్డు సచివాలయంలో జరిగిన పల్స్ పోలియో కార్యక్రమంలో కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో డాక్టర్ సృజన, హెల్త్ సూపర్ వైజర్ వీఎన్‌కే జయలక్ష్మి, సుకన్య, నేతలు రాము, అప్పారావు, సామాజిక వేత్త డాక్టర్ బ్రహ్మ దేశం వసంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వీవీ నరసరాజు రోడ్డులో పోలియోచుక్కలు వేస్తున్న డాక్టర్ చిలకపాటి రామ్‌చంద్



32వ డివిజన్‌లో పోలియో చుక్కలు వేస్తున్న కో ఆప్షన్ సభ్యురాలు గుండె సుభాషిణి



200వ వార్డు సచివాలయంలో..

పేదల అభ్యున్నతే వైఎస్సార్ సీపీ లక్ష్యం

పాయకాపురం(విజయవాడరూరల్): పేదల అభ్యున్నతే ప్రధాన లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగుతోందని సెంట్రల్ సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. వరికూటి నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రాజీవ్‌నగర్లో టీడీపీ సానుభూతిపరులైన 50 కుటుంబాలవారు వెలంపల్లి శ్రీనివాసరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి వెలంపల్లి.. కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడిచిన నాలుగున్నరేళ్లలో దేశంలో ఎక్కడాలేని విధంగా పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలని అందుకు మీరందరూ ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సెంట్రల్ నియోజకవర్గంలోని 21 డివిజన్లలో 63వ డివిజన్‌ను మోడల్‌గా అభివృద్ధి చేస్తానని వెలంపల్లి శ్రీనివాసరావు తెలియజేశారు. తాను గెలిచిన సంవత్సర కాలంలోనే అభివృద్ధి దిశగా పనులు చేపడతానన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన 63వ డివిజన్‌ను.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు మోదుగుల తిరుపతమ్మ, బీహెచ్ఎస్వీ జానారెడ్డి, నేతలు పసుపులేటి యేసు, మోదుగుల గణేష్, సీహెచ్ రవి, అలంపూరు విజయ్, ఇసరపు రాజు, డివిజన్ ఇన్‌చార్జి జలసూత్రం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

రాబోయేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే

పాయకాపురం(విజయవాడరూరల్): రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగించడం ఖాయమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 64వ డివిజన్ విలేజి కండ్రికలో పార్టీ నూతన డివిజన్ కార్యాలయాన్ని కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మతో కలిసి ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజలు పూర్తి సంతృప్తిగా ఉన్నారన్నారు. గడిచిన ఐదేళ్లలో వివిధ స్థాయిల్లో జరిగిన ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యరగొర్ల శ్రీరాములు, అవుతు శ్రీనివాసరెడ్డి, డివిజన్ ఇన్‌చార్జి జలసూత్రం శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ ఎం.రవీంద్రరెడ్డి, సాదం వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



విలేజ కండ్రికలో పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పుస్తక పఠనంతో విజ్ఞానం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో ఆదివారం 'చదవటం మాకిష్టం' కార్యక్రమం నిర్వహించారు. ప్రతి నెలా మొదటి ఆదివారం నిర్వహించే కార్యక్రమంలో గ్రంథాలయంలో నీతి కథలు, జాతీయ నాయకుల చరిత్రలు, జనరల్ నాలెడ్జ్, తెలుగు సామెతలు తదితర పుస్తకాలను ప్రదర్శించారు. పెద్ద సంఖ్యలో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారులు విద్యార్థులతో నీతి కథలు చదివించడం, చెప్పించడం చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి పి.సంపత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. అనంతరం జనరల్ నాలెడ్జ్‌పై విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న గ్రంథాలయ అధికారి సంపత్‌కుమార్

పసుమర్తి శ్రీరామచంద్రమూర్తికి అన్నదాన రత్న పురస్కారం

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని మాచవరానికి చెందిన అన్న సంతర్పణ సమితి ట్రస్ట్ కార్యదర్శి పసుమర్తి శ్రీ రామచంద్రమూర్తిని సర్ సీవీ రామన్ అకాడమీ (సేవ సాంస్కృతిక సంస్థ) ఆదివారం అన్నదాన రత్న పురస్కారంతో ఘనంగా సత్కరించారు. అన్న సంతర్పణ సమితి ద్వారా అందిస్తున్న సేవలకుగానూ ఆయనకు సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో ఆదివారం సినీ హాస్యనటుడు జెన్నీ, నటుడు కాదంబరి కిరణ్, అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డాక్టర్ పగడాల అశోక్, శ్రీకష్ణ చాముండేశ్వరి మహర్షి చేతులమీదుగా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ పురస్కారంతో తమపై బాధ్యత మరింత పెరిగిందని తెలిపారు. అన్నసంతర్పణ సమితి అధ్యక్షులు గుండు దిలీప్ పసుమర్తి శ్రీరామచంద్రమూర్తిని అభినందించారు.



పసుమర్తి శ్రీరామచంద్రమూర్తికి అన్నదాన రత్న పురస్కారం అందజేస్తున్న అతిథులు

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): పోలియో రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. సత్యనారాయణపురంలోని ఏకేటీపీఎం స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కేంద్రంలో చిన్నారులకు ఆయన పోలియో చుక్కలు వేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారులు పోలియో బారిన పడకూడదనే ఉద్దేశంతోనే కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. 2011 తర్వాత దేశంలో ఒక్క పోలియో కేసు కూడా నమోదు కాలేదని, 2012లో మన దేశాన్ని పోలియో రహిత దేశంగా ప్రకటించారని చెప్పారు. తల్లిదండ్రులు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలను వేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, డాక్టర్ రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు దోనేపూడి శ్రీనివాస్, ఒగ్గు విక్కీ, వైద్య అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పిల్లల్లో ఆలోచనాశక్తి పెంచేలా బోధన

లబ్బీపేట(విజయవాడతూర్పు): పిల్లల్లో ఆలోచనా శక్తిని పెంపొందించడమే లక్ష్యంగా తమ పాఠశాలలో బోధన జరుగుతోందని క్యూరియస్ మైండ్స్ స్కూల్ ప్రిన్సిపాల్ యాస్మిన్ షరీఫ్ చెప్పారు. విజయవాడ లెమన్ ట్రీ హోటల్‌లో జరిగిన స్కూలు వార్షిక వేడుకల్లో ఆమె మాట్లాడారు. విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా వారిలోని సామర్థ్యం, సృజనాత్మకతను వెలికితీసేలా తమ పద్ధతులు ఉంటాయని తెలిపారు. ఇవి సత్ఫలితాలు ఇవ్వడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. వేడుకల్లో పిల్లలందరికీ సర్టిఫికెట్లు, మెడల్స్ అందించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

పెనమలూరు: వణుకూరు గ్రామంలో ఆదివారం ఉచిత కంటి వైద్య పరీక్షలు చేశారు. నలంద డిగ్రీ కాలేజ్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అమరావతి సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి వైద్యులు ప్రత్యేక శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని వైఎస్సార్ సీపీ నాయకుడు చక్క గోపీకృష్ణ ప్రారంభించారు. స్థానికులు పరీక్షలు చేయించుకున్నారు.